క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రత్యేక ప్రవేశాలు

బడంగ్‌పేట్‌: ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు బడంగ్‌పేటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో దోస్త్‌ స్పెషల్‌ ఫేజ్‌ ద్వారా అడ్మిషన్లు ఈ నెల 25 నుంచి ప్రారంభమై ఆగస్టు 2న ముగియనున్నట్లు ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎస్‌.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల దోస్త్‌ కోడ్‌ 12818 రిజిస్టర్‌ చేసుకుని అడ్మిషన్లు పొందగలరని సూచించారు. కళాశాలలో బీఏ, బీకాం, కంప్యూటర్‌ అప్లికేషన్‌, బీఎస్సీ–లైఫ్‌ సైన్స్‌, ఫిజికల్‌ సైన్స్‌ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్లు కావాల్సిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని భాగ్యశ్రీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బడంగ్‌పేట్‌: రంగారెడ్డి జిల్లా స్థాయి పోటీలను ఇటీవల సరూర్‌నగర్‌ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలకు బడంగ్‌పేట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.భాగ్యశ్రీ పాల్గొని 100 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం, జావెలిన్‌ త్రోలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఈ నెల 7న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించింది. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.అర్జున్‌, ఉపాధ్యాయులు విద్యార్థిని భాగ్యశ్రీని అభినందించారు. ధైర్యంగా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీ సామ్యూల్‌, సిబ్బంది ఉన్నారు.

సూర్యగిరిలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళాభక్తులు అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించుకున్నారు. అనంతరం ఆలయంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్‌ ట్రస్టీ చైర్మన్‌ రెడ్డిగళ్లరత్నం, సిబ్బంది కాశీనాథ్‌, పూజారులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రుడికి భరోసా



బాధితుడికి నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కందుకూరు: తమతో పాటు చదువుకున్న స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడని కందుకూరు జిల్లా పరిషత్‌ పాఠశాల పదో తరగతి (2003–04)బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు స్పందించారు. అందరూ కలిసి రూ.65 వేలు నగదు జమ చేశారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న తమ చిన్ననాటి మిత్రుడైన కడ్తాల్‌ మండలం పల్లెచల్కతండాకు చెందిన ఇస్లావత్‌ పాండును మంగళవారం కలిసి రూ.65 వేల నగదు అందజేశారు. భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా అండగా నిలబడతామని భరోసా కల్పించారు.

నూతన కల్యాణ మండపం ప్రారంభం

ఎల్‌బీనగర్‌: బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధి సచివాలయనగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని మంగళవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థ శ్రీపాదుల స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజల అనంతరం ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి, బీజేపీ నాయకులు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ గురువు లక్ష్మీనారాయణ, యాదగిరి రావు, దామోదర్‌రెడ్డి, లీలానాథ్‌, జైపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సంగమేశ్వర్‌, పవన్‌రెడ్డి, దుర్గాప్రసాద్‌, వినయ్‌కుమార్‌ పాల్గొన్నారు.



గుంతలమయంగా మారిన కందుకూరు నుంచి పాత శ్రీశైలం రహదారి



గూడూరు–కందుకూరు రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లు

లింకు రోడ్లు.. ప్రయాణానికి పాట్లు

- అధ్వాన రహదారులతో ప్రజల ఇక్కట్లు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

కందుకూరు: ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎవరు అధికారంలోకి వచ్చినా.. ఏళ్లుగా మండలంలో లింకు రహదారుల రూపు మాత్రం మారడం లేదు. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో లింకు రోడ్లు అభివృద్ధికి నోచుకోక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అటు ఆయా గ్రామాల ప్రజలతో పాటు వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు గుంతలు, కంప చెట్లతో ఉన్న రహదారుల నుంచి రాకపోకలు సాగించడంలో తిప్పలు తప్పడంలేదు. అయినా సంబంధిత అధికార యంత్రాంగం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తుంది. ఇది కందుకూరు నుంచి గూడూరు, మాలగూడూరు, ఫార్మా రహదారిని కలిపే లింకు రహదారుల దుస్థితి.

చుట్టూ తిరిగి రావాలి

కందుకూరు మండలం కేంద్రం నుంచి గూడూరు గ్రామం దాని అనుబంధ గ్రామమైన మాల గూడూరు, మరో గ్రామం కటికపల్లి గ్రామాలకు నేరుగా వెళ్లే లింకు రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదు. గూడూరు, కందుకూరు గ్రామాల మధ్య నుంచి ఫార్మా రహదారి సైతం నిర్మించారు. అక్కడి నుంచి రెండు వైపులా ఉన్న లింకు రోడ్లను అభివృద్ధి పరిస్తే మండల కేంద్రానికి ఆయా గ్రామాల వైపు నుంచి రాకపోకలు సాగించడానికి వీలవుతుంది. చుట్టూ తిరిగి రావాల్సిన అవసరం ఉండదు. గూడూరు నుంచి కందుకూరు మధ్య ఉన్న లింకు రహదారి దాదాపుగా నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. మాల గూడూరు నుంచి కందుకూరుకు మూడున్నర కిలోమీటర్లు. ఆ రహదారులతో పాటు పాత శ్రీశైలం రహదారి ప్రస్తుతం ఫార్మా రహదారి నుంచి కందుకూరుకు మరో రెండు కిలోమీటర్ల మేర దూరం ఉంది. ప్రస్తుతం రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. ఇరువైపులా కంప చెట్లతో నిండిపోయి అధ్వానంగా ఉన్నాయి. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగిస్తోంది. లింకు రహదారులను అభివృద్ధి పరిస్తే గూడూరు, కటికపల్లి గ్రామాలతో పాటు ఆ పైనున్న రాచులూరు, లేమూరు, తిమ్మాపూర్‌, బేగంపేట, అగర్మియాగూడ, సరస్వతిగూడ, గుమ్మడవెల్లి తదితర గ్రామాల వైపు నుంచి వచ్చే వారికి దగ్గర దారి అవుతుంది.

గుంతలతో ఇబ్బంది



కందుకూరు నుంచి పాత శ్రీశైలం రహదారి మీదుగా ఫార్మా రహదారి వరకు వెళ్లే రెండు దారులు గుంతలమయంగా మారాయి. అటువైపు ఉన్న మా పొలాలకు వెళ్లాలంటే వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి ఇబ్బందిగా ఉంది. రోడ్డుకి ఇరువైపులా కంప చెట్లు మొలిచి రాకపోకలకు కష్టంగా మారింది.

– టి.సంజీవరెడ్డి, రైతు, కందుకూరు

ప్రతిపాదనలు పంపాం



కందుకూరు నుంచి గూడూరు, మాలగూడూరుతో పాటు పాత శ్రీశైలం రహదారి వరకు లింకు రోడ్ల అభివృద్ధి నిధుల కోసం గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాం. నిధులు ఇంకా మంజూరు కాలేదు. మరోసారి ప్రతిపాదనలు పంపుతాం.

– సతీష్‌రెడ్డి, ఏఈ పీఆర్‌, కందుకూరు

అసెంబ్లీ సాక్షిగా అసత్య ప్రచారాలు

ఎమ్మెల్యే సబితారెడ్డిపై కేఎల్లార్‌ విమర్శలు



కందుకూరు చౌరస్తాలో వ్యాపారులతో మాట్లాడుతున్న కేఎల్లార్‌ తదితరులు

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నిజానిజాలు తెలుసుకోకుండా అసెంబ్లీ సాక్షిగా అసత్య ప్రచారాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌ విమర్శించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కందుకూరుకు వచ్చిన సందర్భంగా పోలీసులు అక్కడ జరుగుతున్న అంగడిని బంద్‌ చేయించి, బీఆర్‌ఎస్‌ నాయకులను అరెస్టులు చేశారని అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం రాత్రి సబితారెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో మంగళవారం సాయంత్రం కేఎల్‌ఆర్‌తో పాటు కాంగ్రెస్‌ నాయకులు మండల కేంద్రంలో కూరగాయలు, పండ్లు, పూలు విక్రయించే చిరు వ్యాపారులతో నేరుగా మాట్లాడారు. సీఎం పర్యటన సందర్భంగా మిమ్మల్ని ఎవరైనా ఇబ్బంది పెట్టారని అడగగా అలాంటిది ఏమీ లేదని వారు చెప్పారు. ఈ సందర్భంగా కేఎల్‌ఆర్‌ మాట్లాడుతూ.. అంగడి యథావిధిగా కొనసాగిందన్నారు. ఎలాంటి అరెస్టులు చేయలేదన్నారు. అనవసరంగా ఆమె విషయం తెలుసుకోకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ పాండురంగారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కృష్ణనాయక్‌, కోఆర్డినేటర్‌ ఎండీ అఫ్జల్‌బేగ్‌, నాయకులు సత్యనారాయణ, శ్రీధర్‌, వీరారెడ్డి, రాకేష్‌గౌడ్‌, రాంరెడ్డి, జగన్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌, కృష్ణ, శ్రీశైలం, జగన్‌ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ నిర్వాహకులు

కందుకూరు: కందుకూరు లయన్స్‌క్లబ్‌ ఆధ్వర్యంలో లయన్స్‌ ఇంటర్నేషనల్‌ డైరెక్టర్‌ ఘట్టమనేని బాబురావు పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్‌ జిల్లా మొదటి వైస్‌ గవర్నర్‌ డాక్టర్‌ జి.మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడారు. అన్నదానం అన్ని దానాల్లోకెల్లా గొప్పదన్నారు. గత పదిహేను ఏళ్లుగా బాబురావు పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని లయన్స్‌క్లబ్‌లు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. లయన్స్‌ సంస్థ చేపట్టే సేవల్లోని ఎనిమిది అంశాల్లో రిలీవ్‌ హంగర్‌ అనేది చాలా ముఖ్యమైనదన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ కందుకూరు అధ్యక్షుడు సురసాని విఠల్‌రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ తీగల జగదీశ్వర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్‌ కోశాధికారి వెంకటేశ్వర్లుగుప్తా, మాజీ ఉప సర్పంచ్‌ గుండ్ర సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు చౌరస్తాలో రాస్తారోకో చేపట్టిన పంచాయతీ కార్మికులు

ముందస్తు అరెస్టులు హేయమైన చర్య

సీఐటీయూ మండల కన్వీనర్‌ బాల్‌రాజ్‌

కందుకూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో తమ సమస్యల పరిష్కారానికి గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన చలో హైదరాబాద్‌ కార్యక్రమానికి వెళ్లకుండా మంగళవారం ఉదయం నుంచే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం వదిలిపెట్టారు. దీంతో వారంతా కందుకూరు చౌరస్తాలో రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్‌ బుట్టి బాల్‌రాజ్‌ మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన చలో హైదరాబాద్‌ కార్యక్రమాన్ని విఘ్నం చేసేలా పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరిస్తామని చెప్పి 8 నెలలు గడుస్తున్నా స్పందనే లేదని విమర్శించారు. ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్‌, కార్మిక సంఘం నాయకులు యాదయ్య, నరసింహ, దశరథ, హరికృష్ణ, సురేష్‌, అనిల్‌కుమార్‌, బాల్‌రాజ్‌, శ్రీపాలు, రాములమ్మ, అండాలు, లక్ష్మమ్మ, చంద్రమ్మ, భాగ్యలక్ష్మి, మమత, నర్సమ్మ, పోచమ్మ, గంగమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

బడంగ్‌పేట్‌: కార్పొరేషన్‌ పరిధిలోని నాదర్‌గుల్‌ ఎంవీఎస్‌ఆర్‌ ఇంజనీరింగ్‌ కాలేజీ నుంచి కమ్మగూడ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం మేయర్‌ చిగురింత పారిజాతారెడ్డి ప్రారంభించారు. పనులు త్వరగా పూర్తి చేసి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట శ్రీధర్‌రెడ్డి, గూడెపు ఇంద్రాసేనా, డీఈఈ జ్యోతిరెడ్డి, నాయకులు ఆనంద్‌రెడ్డి, అశోక్‌, శివారెడ్డి, కాలనీవాసులు తదితరులున్నారు.



పనులు పరిశీలిస్తున్న మేయర్‌ పారిజాతారెడ్డి

ఆడపిల్లల అక్రమ రవాణా అరికట్టాలి

పహాడీషరీఫ్‌ ఎస్‌ఐ దయాకర్‌ , ప్రజ్వల జూనియర్‌ డైరెక్టర్‌ అహ్మద్‌ అలీ

తుక్కుగూడ: ఆడపిల్లల అక్రమ రవాణాను ప్రతి ఒక్కరూ అరికట్టాలని పహాడీషరీఫ్‌ ఎస్‌ఐ దయాకర్‌, ప్రజ్వల జూనియర్‌ డైరెక్టర్‌ అహ్మద్‌ అలీ సూచించారు. మంగళవారం ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో పహాడీషరీఫ్‌ దర్గా నుంచి తుక్కుగూడ వరకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల చేత మానవ అక్రమ రవాణా నిర్మూలన అనే అంశంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది సమాజంలో అతిపెద్ద నేరంగా మారిందన్నారు. ఈ ప్రభావం ఎక్కువగా నిరుపేదలపై పడుతుందన్నారు. ప్రజ్వల సంస్థ ఇప్పటి వరకు 28 వేల మంది అమ్మాయిలు, మహిళలను కాపాడి పునరావాసం కల్పించిందన్నారు. మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రజ్వల అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రిన్సిపాళ్లు సుబ్బరావు, సింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది చంద్ర, బలరాం, సిరాజ్‌, మల్లేష్‌, నరేష్‌, అనిత, సూర్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్‌/ వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు.. టమాట రూ. 30, వంకాయ రూ. 35, బెండ రూ. 35, పచ్చిమిర్చి రూ. 55, కాకర రూ. 38, బీర రూ. 35, క్యాబేజి రూ. 23, ఫ్రెంచి బీన్స్‌ రూ. 65, క్యారెట్‌ రూ. 35, దొండ రూ. 28–40, చిక్కుడు రూ. 65, గోకర రూ. 35, బీట్‌రూట్‌ రూ. 28, క్యాప్సికం రూ. 45, ఆలు రూ. 38, దోస రూ. 15, సొర రూ. 11, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 39, చామగడ్డ రూ. 40. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్‌ ఆఫ్‌ ఆమనగల్లు ఆధ్వర్యంలో తిమ్మరాసిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని లయన్స్‌క్లబ్‌ రీజియన్‌ చైర్మన్‌ శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మహేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ, సంపత్‌కుమార్‌, చంద్రశేఖర్‌, దామోదర్‌రెడ్డిలు దాదాపు 600 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు, మధుమేహ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్‌ జోన్‌ చైర్మన్‌ జనార్దన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్‌ నూతన అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, క్యాంపు చైర్మన్‌ డాక్టర్‌ దామోదర్‌ రెడ్డి, లయన్స్‌ క్లబ్‌మాజీ గవర్నర్‌ జూలురి రమేశ్‌బాబు, చెన్నకిషన్‌రెడ్డి, కార్యదర్శి మహేశ్‌, కోశాధికారి నరసింహా, సభ్యులు వెంకట్‌రెడ్డి, జంగారెడ్డి, విష్ణువాస్‌రెడ్డి, చేగూరి వెంకటేశ్‌, పీఆర్‌ఓ పాషా పాల్గొన్నారు.

భూమి కేటాయించాలని వినతి

తుర్కయంజాల్‌: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌ రెవెన్యూ సర్వే నెంబర్‌ 247లోని 1.27 ఎకరాల వక్ఫ్‌ బోర్డు భూమిని ఇతరులకు కేటాయించకుండా, ముస్లింలకు ప్రార్థనలకు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్‌ మున్సిపాలిటీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండీ గౌస్‌పాషా రాష్ట్ర వక్ఫ్‌ బోర్డు చైర్మన్‌ సయ్యద్‌ అజమతుల్లా హుస్సేనీని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్‌ బురాన్‌, మజర్‌, షరీఫ్‌, ముజీబ్‌ఖాన్‌, మజీద్‌, అఫ్రోజ్‌, నజీర్‌, ఫెరోజ్‌ ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

శంకరకొండ తండా నాయక్‌గా శ్రీను

ఆమనగల్లు: శంకరకొండ తండా నాయక్‌గా శ్రీనునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శంకరకొండ తండాలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గిరిజనులంతా సమావేశమై మేడిగడ్డ తండా నాయక్‌ రవీందర్‌నాయక్‌ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తండా నాయక్‌గా ఎన్నికైన శ్రీనునాయక్‌ను గిరిజనులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ అమర్‌సింగ్‌, మండల కాంగ్రెస్‌ మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, స్థానిక నాయకులు పత్యానాయక్‌, పాండునాయక్‌, శంకర్‌, రమేశ్‌ పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

కడ్తాల్‌: మండల కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎంపీడీఓ సుజాత అధ్యక్షతన మూడో విడత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహించారు. ఏప్రిల్‌ 1, 2023 నుంచి 2024 మార్చి 31వరకూ, 24 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం పాల్గొన్నారు. అధికారులు ఈ నెల 18 నుంచి 29వరకూ గ్రామాల్లో తనిఖీ చేసిన వివరాలను ప్రజావేదికలో వెల్లడించారు. పంచాయతీల వారీగా డీఆర్పీలు చెప్పిన వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత మాట్లాడారు. నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆధార్‌కార్డును పరిశీలించి, స్థానికంగా ఉంటున్నారా? లేదా? పరిశీలించి జాబ్‌కార్డులు మంజూరు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ పీడీ సుభాషిణి, ఏపీడీ సక్రియా నాయక్‌, ఎస్‌ఆర్‌పీ వెంకన్న, పీఆర్‌ఏఈ పరమేశ్‌, ఏపీవో లలిత, ఈజీఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫలహారం బండ్ల ఊరేగింపు



మీర్‌పేటలో ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: బోనాలు ఉత్సవాలలో భాగంగా మీర్‌పేట కార్పొరేషన్‌ పరిధిలో అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. జిల్లెలగూడలో జైభవాని, మీర్‌పేట హనుమాన్‌ దేవాలయ యూత్‌ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఫలహారం బండి ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ పాండుగౌడ్‌, నాయకులు భాస్కర్‌రెడ్డి, సాయినాథ్‌ రెడ్డి, నవీన్‌గౌడ్‌, బాలప్ప, జంగయ్యగౌడ్‌, ఆగమయ్య, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లెలగూడ నవభారత్‌ యూత్‌ అసోసియేషన్‌ ఫలహారం బండి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకకు డిప్యూటీ మేయర్‌ తీగల విక్రంరెడ్డి, స్థానిక నాయకులు రమేష్‌, విజయ్‌, లక్ష్మణ్‌, దయానంద్‌, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉత్సవాలలో పాల్గొన్న వారికి జ్ఞాపికలను అందజేశారు.

జీఐఎస్‌ మ్యాపింగ్‌ సర్వే ప్రారంభం



సర్వేను ప్రారంభిస్తున్న డీసీ యాదయ్య

ఎల్‌బీనగర్‌: గ్రేటర్‌ పరిధిలోని రెసిడెన్షియల్‌, కమర్షియల్‌ ఆస్తులపై జీఐఎస్‌ మ్యాపింగ్‌ సర్వేలో భాగంగా ఇంటింటి సర్వే మంగళవారం ఎల్‌బీనగర్‌ సర్కిల్‌–3 పరిధిలోని హయత్‌నగర్‌ డివిజన్‌లో డీసీ యాదయ్య, కార్పొరేటర్‌ నవజీవన్‌రెడ్డి ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన ఈ సర్వేతో సేకరించిన వివరాలు పారదర్శకంగా ఉంటాయని డీసీ యాదయ్య తెలిపారు. అభివృద్ధి కోసమే ఈ సర్వే చేయడం జరుగుతోందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆస్తులు, యుటిలిటీల వివరాలు మ్యాపింగ్‌ చేయడంతో భౌగోళికంగా గుర్తించడం సులభమవుతుందని పేర్కొన్నారు. ఇంటింటికి వచ్చే సిబ్బందికి తగిన సమాచారం ఇవ్వాలని కోరారు. మొదటి రోజున ఎనిమిది ఆస్తుల వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి మహేందర్‌, ఏఎంసీ దినేష్‌సింగ్‌, టాక్స్‌ ఇన్‌స్పెక్టర్‌ శివరాజు, సర్వేయర్స్‌ బాలసుబ్రహ్మణ్యం, అజయ్‌ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

తుర్కయంజాల్‌: మున్సిపాలిటీ పరిధిలోని తుర్కయంజాల్‌ రెవెన్యూ సర్వే నంబర్‌ 338లోని అక్రమ వెంచర్‌పైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మంగళవారం మున్సిపల్‌ కమిషనర్‌ కె.అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్‌ సభ్యులు పి. శివ కుమార్‌, పల్లపు శివ తదితరులు పాల్గొన్నారు.